క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో బడుగులకు పెద్దపీట



కేశప్పను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీలో బడుగులకు పెద్దపీట వేశామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన సిద్దరాంపురం కేశప్పను శనివారం బుక్కపట్నం మండలం అగ్రహారం రచ్చకట్ట వద్ద ఎమ్మెల్యే అభినందించారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అందరి ఆర్థిక తోడ్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. కేశప్ప మాట్లాడుతూ సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పుల్లారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ రాక

ఎన్పీకుంట: కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్పలతారెడ్డి ఆదివారం కదిరికి వస్తున్నారని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు గంగాధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కదిరి ఆర్‌అండ్‌బీ బంగ్లాకు వస్తారని, ఉపాధ్యాయులు తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లడానికి సంఘాలకతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



యువకులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లచెరువు: మండల పరిధిలోని రాగన్నగారి పల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూర్తి, వెంకటేష్ అనే ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు యువకులు ద్విచక్రవాహనంపై తనకల్లు వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్నారు. రాగన్నగారి పల్లి జాతీయ రహదారి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. తవళంమర్రి గ్రామానికి చెందిన వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కదిరికి చెందిన మూర్తి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేత్రదానంతో మరొకరికి చూపు



అవగాహన కల్పిస్తున్న ఉరుకుందప్ప

ధర్మవరం అర్బన్: నేత్రదానంతో మరొకరికి చూపు వస్తుందని ప్రభుత్వ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తెలిపారు. పట్టణంలోని సాయి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పరిశీలించండి

చెన్నేకొత్తపల్లి: ఓటరు జాబితా పరిశీలన నిష్పక్షపాతంగా ఉండాలని రాప్తాడు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ) వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల బీఎల్‌ఓలతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ప్రతి ఇంటినీ జాగ్రత్తగా తిరిగి వివరాలు నమోదు చేయాలన్నారు. బీఎల్‌ఓలు నమోదు చేసే వివరాలను ఏ రాజకీయ పార్టీ నాయకులకు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

అమడగూరు: గ్రామాల్లో సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఇళ్లకు వస్తున్న దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేసి నిర్మాణాలకు తోడ్పడాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు పథకాలు, సబ్సిడీల గురించి చదివి వినిపించారు. ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యుడు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రావణ సందడి

కదిరి టౌన్: శ్రావణమాస రెండో శనివారం సందర్భంగా పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి, ద్వారక ఆంజనేయ స్వామి, అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో..

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం శ్రావణమాసం సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేక పూలు, తులసిమాలలు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తలుపుల మండలంలో..

తలుపుల: శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు చేపట్టారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. అన్నదానం చేశారు.

పాలపాటిదిన్నె ఆలయం కిటకిట

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండవ శనివారం ఉత్సవాలను ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

శ్రీనివాసనగర్‌లోనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా మహిళలతో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ రకాల పూలు, తులసిమాలలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీష్, కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీ కుంట మండలంలో..

ఎన్పీకుంట: మండల పరిధిలోని పెడబల్లి గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని మూలవిరాట్టును ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ పూజారి మహేష్ తెలిపారు.

పోట్లమర్రిలో..

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి శనివారం ఆకుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భజన బృందాలు భజనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కొమందూరు మారుతిప్రసాద్, సాయికృష్ణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, మండలంలోని పోట్లమర్రిలోని యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ, గంగమ్మ, మహాలక్ష్మీ దేవాలయాలు తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడాయి.



నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆలయంలో దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి



వేంకటేశ్వరస్వామికి తులసిమాలతో అలంకరణ



ధర్మవరంలోని ఆలయంలో ఏడు శనివారాల వ్రతం ఆచరిస్తున్న మహిళలు



పూజలందుకున్న అభయాంజనేయుడు



పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజతో అలంకరణ

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ప్రతిఒక్కరూ తరలిరావాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షుడు లక్ష్మినారాయణఆచారి తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం సమీపంలో శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతులమీదుగా శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కలిసి కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానించారు. సెప్టెంబర్ 6 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా బాబ్జాన్



కదిరి అర్బన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా కదిరికి చెందిన బాబ్జాన్ నియమితులయ్యారు. కదిరిలో ఈ నెల 24,25 తేదీల్లో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాల్లో నియామకం జరిగింది. ఈ విషయంలో సహకరించిన అందరికీ బాబ్జాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మట్కాబీటర్ల అరెస్టు

తలుపుల: మండల కేంద్రంలో మట్కా ఆడిస్తున్న నలుగురు బీటర్లను శనివారం అరెస్ట్ చేసి, రూ.14, 900 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ మగ్బుల్ బాష తెలిపారు. మట్కా, గ్యాంబ్లింగ్ మానుకోవాలని, లేని పక్షంలో పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు.

రికార్డులు నిర్వహించే తీరు ఇదేనా?



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ

ఎన్పీకుంట: అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో సంబంధిత కార్యకర్త పై ఎంపీడీఓ ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని ఎదురుదోన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యకర్త లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రికార్డులను, విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో ఆమెపై మండిపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని, పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శుభకార్యం



వధూవరులతో ఎమ్మెల్యే సిద్దారెడ్డి

గాండ్లపెంట: మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి కుమార్తె పోరెడ్డి హరిణి నిశ్చితార్థం కదిరిలో శనివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బత్తల వెంకటరమణ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

కదిరి టౌన్: సీఎంఆర్‌ఎఫ్(సీఎం సహాయ నిధి)తో పేదలకు మేలు కలుగుతోందని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో శనివారం రూ.4.70 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. తమ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

తనకల్లు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మ్యాన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన అల్లాబకష్ కుమారుడు చాంద్‌బాషా కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చాంద్‌బాషాకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యేకి చాంద్‌బాషా కృతజ్ఞతలు తెలియజేశాడు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, రిటైర్డ్ ఈఓ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు పథకాలు

• ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు వారి ముంగిటకే పథకాలను చేరుస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం బుక్కపట్నం మండలం అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతంగా పథకాలు అమలు చేశామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున అందించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 3 పెద్ద ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 3 వేల కోట్లతో గ్రీన్ ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే, 1,640 కోట్లతో 342 జాతీయ రహదారి పనులు, రూ.864 కోట్లతో 193 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలోను సిమెంట్ రోడ్లు, గ్రామాలను అనుసంధానం చేస్తూ తారు రోడ్డు పనులు పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. నిరుద్యోగులకు సచివాలయాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. వృద్ధులు, మహిళలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్రమ్మ, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి,మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి,వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దరాంపురం కేశప్ప, జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ కో-ఆర్డినేటర్లు రఘునాథరెడ్డి, మల్లికార్జున, లాయర్ నాగమల్లేశ్వర్‌రెడ్డి, మండల మహిళా కన్వీనర్ అరుణాబాయి, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్, రామమోహన్, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, నాయకులు గోపీస్వామి, నరసింహులు, బరిగమ్మ, లింగమయ్య, శివయ్య, మల్లేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

తలుపుల: ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్‌ఐ మగ్బుల్ బాష తెలిపారు. మండలకేంద్రం ఎగువపేటలో సీసీ రోడ్డు వేయడంలో వివాదం తలెత్తి ఇరువర్గాలు ఘర్షణ పడ్డారన్నారు. విచారణ చేసి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నస్రిన్‌కు డాక్టరేట్



కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలు(ఉర్దూ మీడియం) నస్రిన్ షాహిదీకి శనివారం రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. అనంతపురం జిల్లాలో '1885-1947 వరకూ ఇండియన్ నేషనల్ మూమెంట్' అనే అంశంపై శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ క్రిష్ణానాయక్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నస్రిన్‌కు డాక్టరేట్ రావడం పట్ల కళాశాల అధ్యాపకులు అభినందించారు. పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా మదర్‌థెరిసా జయంతి



మదర్‌థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ధర్మవరం: పట్టణంలోని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జున సమక్షంలో మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వభారతి స్కూల్‌లో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను పాఠశాల చైర్మన్ రిజ్వాన్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

సేవలు మరువలేనివి

కొత్తచెరువు: మదర్‌థెరిసా సేవలు మరువలేనవని గ్రంథాలయ అధికారి జయరామ్ పేర్కొన్నారు. కొత్తచెరువు శాఖా గ్రంథాలయంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్ హాజరయ్యారు.

నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి

అమడగూరు: ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల టీడీపీ నిర్వహించిన పలు బహిరంగ సమావేశాల్లో నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడు, అచ్చన్నాయుడుతో పాటుగా ఇతరులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వలనే పుంగనూరు, అంగళ్లు వద్ద పెద్ద గొడవలకు దారితీసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, సోషల్‌మీడియా కన్వీనర్ జహీర్‌భాషా, సర్పంచ్ షబ్బీర్, పోలింగ్ బూతు కన్వీనర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి: టీడీపీ నేత నారాలోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం మండల కన్వీనర్ పెద్దరికం నరేంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆపార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఏ కార్యకర్తపై అయితే ఎక్కువ కేసులు నమోదు అవుతాయో వారికే నామినేటెడ్ పోస్టులు ఇస్తామని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా మండల కోకన్వీనర్ హరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే కేసులు నమోదు చేయాలి

ఎన్పీకుంట: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబు, ఆయన తనయుడు నారాలోకేష్ పై చర్యలు చేపట్టాలంటూ మండల సోషియల్ మీడియా విభాగం నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. లోకేష్ యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీలో ఎక్కువ కేసులు ఉన్నవారికే పదవులు ఇస్తామని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఎస్‌ఐ ఇస్మాయిల్‌ఖాన్‌ను కోరారు. కార్యక్రమంలో సోషియల్ మీడియా విభాగం నాయకులు కె.సురేంద్ర రెడ్డి, రెడ్డప్ప, అక్బర్‌వలి, మల్లికార్జున ఉన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

నల్లచెరువు: యర్రగుంటపల్లిలో శనివారం మలేరియా, డెంగీ వ్యాధులపై కదిరి మలేరియా వైద్యాధికారులు రామాంజనేయులు, మహబూబ్ బాష గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటినీ సందర్శించారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఆశాలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

బత్తలపల్లి: మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నాగులచవితి నిర్వహించారు. కోడేకండ్ల, ముష్ఠూరు, సంజీవపురం, అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి, డి.చెర్లోపల్లి, పత్యాపురం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, నెత్తివారంపల్లి, వేల్పుమడుగు, లింగారెడ్డిపల్లి, చెన్నరాయపట్నం, విశ్వనాథపురం, బత్తలపల్లి, పోట్లమర్రి తదితర గ్రామాల్లో వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.

80 శాతం సబ్సిడీతో ఉలవలు

అమడగూరు: ప్రస్తుతం ఉలవ పంట సాగుకు అనుకూలంగా ఉన్నందున ప్రభుత్వం రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ఉలవ సాగు చేయాలనుకునే రైతులు సంబంధిత ఆర్బీకేలకు వెళ్లి పేర్లను నమోదు చేయించుకోవాలి. క్వింటాలు ఉలవల ధర రూ 10,800 ఉండగా ప్రభుత్వ సబ్సిడీ ధర పోగా రైతువాటాగా రూ 2,160 నిర్ణయించింది. కాగా, పంట సాగు రైతులు తప్పకుండా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని అధికారులు సూచించారు.

'సత్యసాయి' కార్మికుల నిరసన



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడిమర్రి: సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. స్థానిక మద్దులచెర్వు రోడ్డులోని సత్యసాయి తాగునీటి సంపువద్ద శనివారం పెద్దఓబిలేసు, లక్ష్మీరెడ్డి, నరసింహారెడ్డి, తిరుపాలు తదితర కార్మికులు శనివారం నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన కార్మికులు, పదవీ విరమణ పొందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా గ్రాట్యూటీ ఇవ్వడమే కాక ఈపీఎఫ్‌ను వెంటనే వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, జయరాములు తదితర కార్మికులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: వేతనాలు చెల్లించాలంటూ శనివారం ముదిగుబ్బ పంప్‌హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు రెండో రోజు శనివారం కూడా నిరసన వ్యక్తం చేశారు. అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు రాజశేఖర్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రత్నం, ధర్మ, గంగాధర్, గోపాల్, రమేష్, ఆలీ, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

అమడగూరు: విద్యార్థి దశలో విద్యార్థులంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్స్ కోసం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యాపకులు మాట్లాడుతూ చదువుకునే సమయంలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్, మద్యం, గుట్కా, సిగరెట్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదివి ఉన్నత పదవులను అలంకరించాలన్నారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథరెడ్డి, షానవాజ్, గంగన్న, ఇందాదుల్లా, సూర్యప్రకాష్, నాగేంద్రరెడ్డి, జయరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన పవన్

కదిరి టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన పవన్‌కుమార్ రెడ్డి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.